"అది తెలుసుకోడానికే."

""అదంటే?"

"చెట్లు ఊహించుకో."

"ఊహించుకున్నాను."

"నక్షత్రాలని కూడా."

"వాటినీ ఊహించుకున్నాను."

"రాముడ్ని?"

"ఊహించుకున్నాను."

"బావుంది. ఇప్పుడు లబ్ డబాయ్‌ని ఊహించుకో."

"దేన్ని స్వామీ?"

"లబ్ డబాయ్‌ని."

"నేనెప్పుడూ దాన్ని చూడలేదు స్వామీ. ఎలా ఊహించుకోగలను?"

"అంటే నువ్వు చూసినదాన్నే కదా నువ్వు ఊహించుకోగలిగేది? అలాగే నేను రాముడిగా, కృష్ణుడిగా రూపం దాల్చిన ఆ నిరాకార బ్రహ్మన్ని దర్శించే ప్రయత్నంలో ఉన్నాను. ఆ సాధనలో భాగంగా ఈ గుహలో ఏకాంతంగా నివశిస్తున్నాను."

"ఇప్పుడర్థమైంది స్వామి."

## 29. పలకరింపు

తపస్సంపన్నుడైన ఓ సాధువు తన రాజ్యంలోకి వచ్చాడని ఓ రాజుగారికి తెలిసింది. వెంటనే తన పరివారంతో ఆయన దర్శనార్థం వెళ్ళాడు.

అయితే, ఆ సాధువు రాజుగారిని పట్టించుకోకుండా అతని వెంటవచ్చిన మంది మార్బలంలోని వాళ్ళ యోగ క్షేమాలని విచారించాడు. సాధువు ఎంతకీ తనతో మాట్లాడక పోవడంతో అవమానంతో రాజుగారు వెనక్కి

తిరిగారు. అప్పుడు సాధువు రాజుని ఆపి నవ్వుతూ చెప్పాడు.

"పలకరించకపోతే కలిగే బాధ నీకిప్పుడు అర్థమైంది కదా? భోగాలలో మునిగి తేలే నువ్వు దేవుడ్ని పట్టించుకోకుండా వుంటే ఆయనకెంత బాధ కలుగుతుందో అర్థమైందా? ఇకనైనా దైవాన్ని ప్రార్థన ద్వారా నిత్యం పలకరిస్తూండు."

రాజు మనసుకి ఆ హితబోధ గట్టిగా పట్టుబడటంతో ఆయన నిత్యం మూడు పూటలూ దైవ ప్రార్థన చేయసాగాడు.

## 30. భక్తి-భుక్తి

దాదాపు నలభై ఏళ్ళపాటు లక్ష్మీ నరసింహస్వామి గుడికి నిత్యం వెళ్ళి లక్ష్మీ నృసింహ కరావలంబ స్తోత్రాన్ని పారాయణం చేసిన ఓ భక్తుడు మరణించాడు. అతన్ని యమభటులు యమధర్మరాజు దగ్గరకి తీసుకెళ్ళారు. అతని పాప పుణ్యాలని విచారించాక యముడు అతన్ని స్వర్గానికి తీసుకు వెళ్ళమని ఆజ్ఞాపించాడు.

ఆ గుళ్ళో నలభై ఏళ్ళకి పైగా పూజారిగా పనిచేసినతను కూడా మరణించడంతో, అదే సమయంలో యముడి ముందు అతనూ హాజరయ్యాడు. అతని పాప పుణ్యాలని విచారించి యముడు అతన్ని నరకానికి తీసుకెళ్ళమని ఆజ్ఞాపించాడు.

ఇది గమనించిన భక్తుడు సందేహంగా యముడిని అడిగాడు.

"నలభై ఏళ్ళకి పైగా దేవుడ్ని కొలిచిన అతన్ని స్వర్గానికెందుకు పంపడం లేదు?"

"అతను కొలిచింది భక్తులని తప్ప భక్తితో దేవుడ్ని కాదు. భుక్తి కోసం భక్తులని దక్షిణ కోరుతూ వాళ్ళముందు చేతిని చాపాడు తప్ప ఓ సారైనా చేతిని వెనక్కి పెట్టి దేవుడి ముందు ఆ చేతిని చాపలేదు. అతనికసలు దేవుడి